www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 24 | మే | 2025
పేజీలు 8

# నమ్మిన సిద్ధాంతంకై నడిచిన రణధీరుడు

**-ఆశయం, ఆచరణ మూర్తీభవించిన గిరిప్రసాద్**
**-నేడు 29వ వర్ధంతి**



నమ్మిన సిద్ధాంతంకై నడిచిన రణధీరుడు ఆయన. యుక్త వయస్సులోనే తెలంగాణ గ్రామీణ ప్రాంత ఇతి బాధలను చూసి చలించి ఉన్నత విద్యను వదిలి సరాసరి రాజకీయ శిక్షణా శిబిరానికి చేరుకున్న కార్యశీలి. సామాన్య కార్యకర్తగా మొదలైన ఆ ప్రస్థానం భారత కమ్యూనిస్టు పార్టీలో అగ్ర స్థానానికి చేరుకుంది. ఆశయం, ఆచరణ మూర్తీభవించిన మహానీయుడు నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి నేడు. గిరిప్రసాద్ 29వ వర్ధంతి ఒక పరిస్థితిలో జరుపుకుంటున్నాం. 99 సంవత్సరాల ఉద్యమ ప్రస్థానాన్ని ముగించుకుని సిపిఐ శత వసంతంలోకి అడుగిడింది. నాటి ఉద్యమ ఘట్టాలను నేటి తరానికి తెలియజేస్తూ కార్యకర్తలను భవిష్యత్తు పోరాటాలకు కార్యోన్ముఖులను చేస్తున్న సందర్భమిది. వాడ వాడలా పార్టీ శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారన్న విషయం విధితమే. మరో పక్క పెరుగుతున్న మతోన్మాదం, ఆర్థిక అంతరాలు దేశాన్ని సంక్లిష్ట స్థితికి నెట్టివేస్తున్న సమయం నాటి తెలంగాణ సాయుధ పోరాటం దళ కమాండర్ నుంచి రాజ్యసభ సభ్యునిగా, సిపిఐ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి వరకు సాగిన గిరిప్రసాద్ జీవితాన్ని మననం చేసుకుని ఆ స్ఫూర్తితో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుని ప్రజా పోరాటాలను నిర్వహించాలి. నల్లమల గిరిప్రసాద్ ఖమ్మం జిల్లా మధిర మండలం తొండలగోపవరం గ్రామంలో ఎగువ మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించారు. మద్రాస్ కళాశాలలో చదువుకుంటూ తెలంగాణలోని పరిస్థితులు, ఆంధ్రమహాసభ కార్యక్రమాలను తెలుసుకుని విద్యను మధ్యలో వదిలేసి ఇప్పటి ఎన్‌టిఆర్ జిల్లా తునికిపాడు గ్రామంలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యాడు. ఆ తర్వాత గ్రామ రక్షణ దళంలో సభ్యునిగా చేరాడు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గిరి దళానికి నాయకత్వం వహించాడు. పాల్వంచ ప్రాంతంలో గ్రామాలను విముక్తి చేసి వందలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేశాడు. మన్యం ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పొందిన గిరిప్రసాద్‌ను అంతం చేసేందుకు నిజాం రక్కసి మూకలు అనేక ప్రయత్నాలు చేశాయి. గిరిదళంపై కాల్పులు జరపటంతో తుపాకి గుండ్లకు గిరిప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. రక్తం మడుగులో ఉన్న గిరిప్రసాద్‌ను గిరిజనులు రక్షించారు. సాయుధ పోరాట విరమణ అనంతరం ఖమ్మం నుంచి శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఉవ్వెత్తున సాగిన విశాఖ ఉక్కు సాధనోద్యమ సందర్భంగా తన తోటి సిపిఐ సభ్యులతో కలిసి రాజీనామా చేశారు. 1992లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఖమ్మంజిల్లా కార్యదర్శిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా, సిపిఐ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శిగా గిరిప్రసాద్ పని చేశారు. పార్టీ నిర్మాణంపై గిరిప్రసాద్ మాటలు సదా అనుసరణీయం. కమ్యూనిస్టులకు నిర్మాణమే ఏకైక ఆయుధమని సమర్థులు, చైతన్యవంతులైన కార్యకర్తలు మాత్రమే ఆశయాలను, లక్ష్యాలను నెరవేర్చగలరని ఆయన బోధించేవారు. నిరంతరం నూతన కార్యకర్తలను పార్టీ వైపు ఆకర్షించడం వారికి సైద్ధాంతిక శిక్షణనిచ్చి పార్టీని బలోపేతం చేయడం నాయకులా పార్టీ బాధ్యుల కర్తవ్యం కావాలని గిరిప్రసాద్ చెప్పేవారు. గ్రామస్థాయి నుండి అన్ని కమిటీలు పట్టుదలతో పనిచేసినప్పుడే ఇతర ప్రాంతాలకు, ఇతర రంగాలకు పార్టీ విస్తరించగలుగుతామని ఆయన చెప్పిన మాటలు అక్షర సత్యాలు. ప్రజల ఆలోచనల్లో మార్పులు వచ్చాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో అన్ని సంబంధాలు దాదాపుగా ఆర్థిక సంబంధాలుగా మారుతున్న వేళ కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షించడం వారికి సుక్షితులైన కార్యకర్తలుగా తయారు చేయడం అంత తేలికైన పని కాదు. ఇందు కోసం వివిధ బాధ్యతల్లో ఉన్న నాయకత్వం మరింతగా శ్రమించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా గిరిప్రసాద్ మాటలను జ్ఞప్తికి తెచ్చుకోవాలి. 1980 దశకంలో మధిరలో జరిగిన ఓ సమావేశానికి హాజరైన గిరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు నాయకుల వద్దకు భవిష్యత్తులో రాకపోవచ్చు. ప్రస్తుతం ఉన్న పరిస్థితి ఉండకపోవచ్చు. ఎవరైతే జనంలోకి వెళతారో వారే నాయకులుగా మిలుగుతారన్నారు. నేటి పరిస్థితిని దాదాపు మూడు దశాబ్దాల క్రితమే చెప్పిన కమ్యూనిస్టు తత్వవేత్త గిరిప్రసాద్. శత వసంతంలోకి కమ్యూనిస్టు పార్టీ అడుగిడిన సందర్భంగా నేటి క్యాడర్‌లో నూతన ఉత్తేజం నింపడంతో పాటు కమ్యూనిస్టు భావజాలానికి దూరంగా జరుగుతున్న యువతను ఆకర్షించాలి. ప్రజా సమస్యలను గుర్తించడం వాటి పరిష్కారానికి బహుముఖ పోరాటాలు నిర్వహించడమే గిరిప్రసాద్‌కు మనమిచ్చే నివాళి. శత వసంత వేళ కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానంలో నిప్పులు చెరగని సూర్యుడిలా మసకబారని చంద్రునిలా నిలిచిన గిరిప్రసాద్‌కు అక్షరాంజలి ఘటిస్తూ...

నూనూగు మీసాల ప్రాయంలో తుపాకి పట్టి
పోరాటంలో తుపాకి గుండ్లకు ఎదురొడ్డి నిలిచి
ఆశయానికి ఆచరణ రూపమిచ్చి
మరణం లేని మహోజ్వల సిద్ధాంతాన్ని నమ్మి
కడవరకు శ్రామికజన అభ్యున్నతికై శ్రమించి
అమరుడైన గిరిప్రసాద్ అందుకో మా లాల్ సలాం.

-ప్రజాపక్షం/ఖమ్మం

CENTENARY OF STRUGGLES & SACRIFICES

# నగరాన్ని పరిశుభ్రంగా ఉంచండి



**-ప్రజలను ఒప్పించి అభివృద్ధి పనులు పూర్తి చేయాలి**
**-అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అభివృద్ధిలో ముందంజలో ఉన్న ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని రెండవ డివిజన్ పాండురంగాపురంలో పర్యటించి కోటి రూపాయలతో నిర్మించనున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ పాండురంగాపురం ఖమ్మం నగరానికి దూరంగా ఉండేదని కాల క్రమేణ అభివృద్ధి

మిగతా 2లో..

# ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి కృషి



**- నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా నిలుపుకుందాం**
**- ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు**
**- రూ.2.62 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజా సంక్షేమం, గ్రామాలాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం పాల్వంచ మండల పరిధిలోని వివిధ గ్రామపంచాయితీల్లో

మిగతా 2లో..

# యుద్ధ ప్రాతిపదికన యుటి పనులను పూర్తి చేయాలి

**-జూలై 10లోగా నీటిని విడుదల చేయాలి**
**-పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి**



2లో

# వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు రూపొందించాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గతేడాది వరదల అనుభవాన్ని పరశీలిస్తూ ఈసారి ముందుగానే సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో వర్షాకాలం ముందస్తు చర్యలపై కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతంలో వరద ప్రభావితమైన డివిజన్లలో నీళ్లు వచ్చిన ఇండ్లు తదితర వివరాలపై సమీక్ష జరిపి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఇంచార్జి అధికారులను నియమించారు. ప్రతి డివిజన్‌కు వార్డు ఆఫీసర్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇంజనీరింగ్ అధికారులు కలిసి బృందాలుగా ఏర్పడి పని చేయాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వరదల సమయంలో ప్రజలకు తాత్కాలిక ఆశ్రయం కల్పించేందుకు అవసరమైన అన్ని వసతులతో కూడిన రిహాబిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా కేంద్రాల్లో మంచినీటి సరఫరా, విద్యుత్, లైట్లు, ఫ్యాన్లు, కూలర్లు, ఆరోగ్య సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి డివిజన్‌లో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి కార్పొరేటర్లు, యువతను వాలంటీర్లుగా చేర్చి ప్రజలకు తక్షణ సమాచారాన్ని చేరవేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు రిహాబిలిటేషన్ సెంటర్లకు చేరుకున్న తర్వాత వారికి అవసరమైన నివాసం, ఆహారం, వైద్య సాయం వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక శానిటరి సూపర్‌వైజర్లను నియమించనున్నట్లు వారిని ఇంచార్జి ఆఫీసర్, వార్డు ఆఫీసర్ పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రజల రక్షణ కోసం కంట్రోల్ రూము ఏర్పాటు చేసి ప్రతి కాల్‌కు స్పందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వరదకు గురయ్యే డివిజన్లలో కాలువలను శుభ్రపరిచేలా కార్యాచరణ చేపట్టామన్నారు. వర్షపు నీరు వచ్చిన వెంటనే వెళ్లేలా కాలువలను శుభ్రంగా ఉంచాలని ఆయన అధికారులకు సూచించారు.

# పశువుల రవాణాలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పశువుల అక్రమణాలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని లా అండ్ ఆడర్ అడిషనల్ డిసిపి ప్రసాదరావు అన్నారు. శుక్రవారం అక్రమ రవాణాను నియంత్రించేందుకు జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టులను ఆయన తనిఖీ చేశారు. వైరా మండల పాలడుగు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్కుపోస్టులు ఇరవైనాలుగు గంటలు వాహన తనిఖీలు చేస్తూ ఉండాలన్నారు. పశువులు తరలించే వాహనాలు గుర్తించి అన్ని పత్రాలు క్షుణంగా తనిఖీ చేసి అనుమతి ఇవ్వాలన్నారు. పత్రాలు లేని వాహనాలను సీజ్‌చేసి కేసులు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సరిహద్దు చెక్‌పోస్ట్‌లతో పాటు జిల్లా కేంద్రంలో సైతం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. బక్రిద్ పండుగను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మతసామరస్యంతో జరుపుకోవాలన్నారు. ఈద్గాలతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు అడిషనల్ డిసిపి ప్రసాదరావు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం

**- పిర్‌టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు**



**ప్రజాపక్షం/ మధిర :** విద్యారంగ సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలల బలహీన పరిచేలా ఉండకూడదని, ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందామని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మధిర సిపిఎస్ ఉన్నత పాఠశాల ఆవరణంలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా కృషి చేయాలని తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలను క్లబ్ చేస్తూ మూడు పాఠశాలల్లో అన్నింటిని విలీనం చేయటం నష్టదాయకమని, దీనిపైన విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యా సంస్కరణలు చేపట్టే ముందు విద్యావేత్తలు, మేధావులు, ఉపాధ్యాయ సంఘం నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు అన్నింటిని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, మాజీ జిల్లా అధ్యక్షులు మోత్కూరి మధు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మారెడ్డి, రాష్ట్ర బాధ్యులు రెబ్బా శ్రీనివాసరావు, మధిర మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి



**- టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అనుమోలు**

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని టిఎస్‌యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక కెజిబివి పాఠశాల నందు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు జరుగుతున్న మండలస్థాయి శిక్షణా తరగతులను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో శిక్షణా తరగతులు నిర్వహించడం అభినందనీయమని, ఈ శిక్షణా తరగతులతో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి దోహదం చేస్తాయని అన్నారు. ఈనెల 25 నుండి 31వ తేదీ వరకు ఎన్రోల్మెంట్(బడిబాట) జీపు జాతాలో ఉపాధ్యాయులు పాల్గొని ఎన్రోల్మెంట్‌కు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను, పిఆర్సిని వెంటనే ప్రకటించాలని, డిఎస్సీ 2024 ద్వారా నియామకం అయిన ఉపాధ్యాయులకు నియామక తేదీ నవంబర్ 10గా ఆర్థిక శాఖ నుంచి ఉత్తర్వులు ఇప్పించాలని, 2008 డిఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యాయులకు వెంటనే వేతనాలు చెల్లించాలని, ట్రెజరీ కార్యాలయాల్లో పేరుకుపోయిన పెండింగ్ బిల్స్, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల బిల్స్ అన్నింటిని కూడా క్లియర్ చేసి ఉద్యోగ ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నంద్రు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శి శివపార్వతి, కోశాధికారి నీలం సైదారావు పాల్గొన్నారు.

# మల్లారం సిపిఐ గ్రామశాఖ కార్యదర్శిగా పరుచూరి రాము ఎన్నిక



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మధిర మండలం మల్లారం గ్రామంలో జరిగిన సిపిఐ గ్రామశాఖ మహాసభలో మల్లారం నూనత గ్రామశాఖ కార్యదర్శిగా పరుచూరి రాముతో పాటు గ్రామ సహాయ కార్యదర్శులుగా గరిడేపల్లి వెంకటేశ్వరరావు, దాసరి ప్రకాశ్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికోవటం జరిగిందని సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎంఎ రహీం శాఖ మహాసభలో ప్రకటించటం జరిగింది. వీరితో పాటు మరో 20మందిని గ్రామశాఖ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవటం జరిగింది. నూతనంగా ఎన్నికైన గ్రామశాఖ కార్యదర్శి పరుచూరి రాము మాట్లాడుతూ మల్లారంలో సిపిఐ పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తానని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన గ్రామశాఖ కార్యవర్గ సభ్యులందరం కలిసి మల్లారం గ్రామ సిపిఐ సర్పంచ్ గెలుపు కోసం పనిచేస్తామని తెలిపారు. కార్యదర్శి ఎన్నికకు సహకరించిన సిపిఐ రాష్ట్ర, జిల్లా, మండల నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# ఐసిడిఎస్ నూతన సిడిపిఓగా బాధ్యతలు స్వీకరించిన మెహరున్నీసాబేగం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఐసిడిఎస్ సత్తుపల్లి ప్రాజెక్ట్ నూతన సిడిపిఓగా మెహరున్నీసా బేగం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సిడిపిఓ కనకదుర్గ పదవీ విరమణ చేశారు. మెహరున్నీసాబేగం గతంలో కల్లూరు ఏసిడిపిఓగా విధులు నిర్వహించారు. బాద్యతలు స్వీకరించిన మెహరున్నీసాకు సూపర్ వైజర్స్, ఆఫీస్ స్టాఫ్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం సూపర్వైజర్స్, ఆఫీస్ స్టాఫ్ తో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ప్రసాద్, సూపర్వైజర్లు గంగాజలం, వసంతరాణి, భవాని, కమల, రమాదేవి, రజిని సుజాత, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లో పలువురి చేరిక



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని గుంటుపల్లిగోపారంలో కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు శుక్రవారం మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో జరిగాయి. పార్టీలోకి కోట వెంకటేశ్వర్లు, కొండూరి రామకృష్ణ కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరగా మాజీ జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ సర్పంచ్ కోట శ్రీనివాసరావు పార్టీలో చేరిన వారికి బిఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి శీలం కవిత, మాజీ మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి సంక్రాంతి కృష్ణారావు, అయ్యవారిగూడెం సొసైటీ అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు, కుడుముల మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ సానుభూతిపరురాలు మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌కు చెందిన సిపిఐ సానుభూతిపరురాలు ఆదెపు చిట్టెమ్మ(74) అనారోగ్యంతో శుక్రవారం ఇంటి వద్ద మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు. మృతురాలికి ఒక కుమారుడు, కూమార్తె ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల సమితి సభ్యులు దండి రంగారావు, వెంపటి సురేందర్, వెంపటి రాము, ఏఐవైఎఫ్ యువజన సంఘం సభ్యులు మిరియాల నరుణ్‌తేజ్, అక్కినపల్లి దేవయ్య, రెబ్బగొండ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యానికి రూ. 41 వేల ఆర్థికసాయం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని మర్లపాడు గ్రామానికి చెందిన బాలల వేణు పక్షవాతానికి గురై ఎడమ కాలు, చేయి పడిపోయి, సర్జరీ కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేరి దాతల సాయం కోరగా స్పందించిన యువ సేవా సమితి బాద్యులు దాతల ద్వారా సేకరించిన రూ. 41 వేలను సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ చేతుల మీదగా శుక్రవారం వేణు కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యువసేవ సమితి బాద్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని, వారు చేసే సేవలు యువతకు స్ఫూర్తి దాయకంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో యువసేవ సమితి వ్యవస్థాపకులు జొన్నగట్ల రాజు, యువసేన మందపాటి సాయి, సత్తుపల్లి ఇంచార్జ తన్నీరు మురళి, యువసేవ సమితి కల్లూరుగూడెం ఇంచార్జ్ ఖమ్మంపాటి రామకృష్ణ, యువసేవ సమితి డైరెక్టర్ ఇంచార్జీలు తదితరులు పాల్గొన్నారు.

## టయోటా షోరూం ప్రారంభించిన కూనంనేని



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : కొత్తగూడెం నియోజకవర్గం లోని విద్యానగర్ నందు నూతన నూతనంగా ఏర్పాటు చేసి కాకతీయ టయోటా కార్ షోరూమ్ నుకొత్తగూడెం శాసనసభ్యులు కూనమనేని సాంబశివరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టయోటా కంపెనీ నూతన టెక్నాలజీతో రకరకాల కార్లు కొత్తగూడెం షోరూం నందు అందుబాటులో నుంచి ప్రజల సౌకర్యార్థం సరసమైన ధరలలో అమ్మకాలలో కొనసాగించాలని అన్నారు. పేద మధ్య తరగతి వారికి అది తక్కువ ధరలకు అందించాలని దృక్పథంతో జిల్లా కేంద్రంలో షోరూం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ప్రజలు వారికి నచ్చిన కార్లను కొనుగోలు చేసి టెక్నాలజీకి అనుకూలంగా కార్లను వినియోగించుకోవాలని తెలియజేశారు. ఏ కారునైనా వివిధ ఫైనాన్స్ సంస్థల ద్వారా ఈఎంఐ పద్ధతిలో కొనుగోలు చేసుకోవచ్చును ఎక్స్ఛేంజ్ సౌకర్యం కూడా కలదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం సిబ్బంది కస్టమర్లు వివిధ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బెట్టింగ్ రాయుళ్ళతో తస్మాత్ జాగ్రత్త

ప్రజాపక్షం/దమ్మపేట: బెట్టింగ్ రాయుళ్ళతో జాగ్రత్తగా ఉండాలని ప్రముఖ న్యాయవాది భవాని కృష్ణ యాదవ్ విజ్ఞప్తి చేశారు. మీ స్నేహితులలో ఎవరైనా బెట్టింగులు ఆడే అలవాటు ఉన్నవారి దగ్గర నుండి మీ బ్యాంక్ ఖాతాలోకి ఎప్పుడూ పొరపాటన ఒక వంద రూపాయలు కూడా పంపించుకోవద్దని కోరారు. అలా పంపించుకున్నట్లైతే మీ బ్యాంక్ ఖాతాలు బ్లాక్ అవుతాయన్నారు. ఒక వేళ మీ శాలరీ అకౌంట్ అయితే మీ బాధ వర్ణనాతీతమని, ఒక వేళ ఎక్కువ డబ్బులు ఉంటే అవి కూడా కేవలం రూ. 100లకి కూడా బ్లాక్ అవుతాయని తెలిపారు.

## వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిర్వహించాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : వేసవి సెలవుల లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ను నిర్వహించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిభిరం ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యా రంగం ను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 31 వరకు తలపెట్టిన బడిబాట కార్యక్రమం ను విజయవంతం చేయాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చొరవ తీసుకోవాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ట్రెజరీ కార్యాలయాలలో బిల్లులు మూలుగుతున్నాయని అన్నారు. 2008 డీఎస్సీ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల నమోదు ను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బుర్రి వెంకన్న, జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, జిల్లా కార్యదర్శి సురేష్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు జ్యోతి, టి.గురవయ్య, కార్యదర్శులు డి.అరుణ, నాసరయ్య, శ్రీనివాసరావు, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## మధిరలో పర్యటించిన పొంగులేటి





ప్రజాపక్షం/ మధిర : తెలంగాణ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం మధిరలో పర్యటించారు. పర్యటనలో భాగంగా మొదటిగా రెడ్డి గార్డెన్స్ నందు జరుగుతున్న కోట జయరాజు కుమార్తె డాక్టర్ కోట వినూత్న, వెంకట్‌ల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం సాయినగర్ కాలనీ నందు నల్లగట్ల సాయి ప్రణీత్ వివాహ వేడుకకు, ఎస్సీ కాలనీ నందు అఖిల్ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారికి నూతన వస్త్రాలను కానుకగా అందించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు యన్నం కోటేశ్వరరావు తండ్రి అనారోగ్యంతో ఉండగా వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ కోట రాంబాబు, దేవిశెట్టి రంగారావు, కటికల సీతారామిరెడ్డి, అమరవాది సత్యనారాయణరెడ్డి, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, యర్రగుంట రమేష్, బండి వెంకటేశ్వర్లు, అక్కినపల్లి నాగేశ్వరరావు, చిలకా సత్యం, సోమ రవికాంత్, తమ్మిశెట్టి బాలకృష్ణ, నర్సింహారావు, చిలకా రాజేంద్రప్రసాద్, గద్దల యశోద పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ



ప్రజాపక్షం/పెనుబల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ నిర్మాణం లో భాగంగా పెనుబల్లి మండలం లోని అన్ని గ్రామాల వారీగా మొత్తం 599+ మంది పేద కుటుంబ లబ్ధిదారులకు శుక్రవారం పెనుబల్లి ఆర్య వైశ్య కళ్యణ మండపంలో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, డాక్టర్ మట్టా దయానంద్ ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ప్రజలు 10 సంవత్సరాలు నిరీక్షణ తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం పేదవాడి ఇంటి కల నెరవేర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో, సత్తుపల్లి నియోజకవర్గంలో ఈరోజు ఇందిరమ్మ ఇల్లు గృహ నిర్మాణం చేసుకోవటానికి మనందరం ఒక పండగ లాగా, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు లాగా ఇందిరమ్మ పట్టాలు తీసుకుంటున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రమే పేద కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. దళిత నియోజకవర్గమైన మన సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావుకి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి ప్రజలందరి తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆర్డీవో, ఎంపీడీఓ, తహశీల్దార్, హౌసింగ్ ఆఫీసర్ మాట్లాడుతూ ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇల్లు నిర్మాణంలో మొదటి నుండి చేపట్టవలసిన ప్రతి అంశాన్ని లబ్ధిదారులకు పూర్తిగా వివరించారు. పెనుబల్లి మండలంలో మొత్తం 599 ఇందిరమ్మ ఇల్లు చేపడుతున్నామని, పెనుబల్లి మండలంలో పైలెట్ ప్రాజెక్టు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం జరుగుతున్న సందర్భంలో వారికి మొదటి విడత లక్ష రూపాయలు అందరి అకౌంట్లో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు జమ చేసిందని వివరాలతో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఇందిరమ్మ ఇల్లు ప్రక్రియలో సత్తుపల్లి నియోజకవర్గం అగ్రగామీగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు నారాయణ వరపు శ్రీనివాస్, కల్లూరు ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, సత్తుపల్లి ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షులు పసుమర్తి విశ్వనాథం, పెనుబల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, కిసరి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం జిల్లా అధికార ప్రతినిధి పొట్లపల్లి వెంకటేశ్వరరావు, పంచాయతీ సెక్రెటరీ, ప్రభుత్వ అధికారులు, ఎస్సై, పెనుబల్లి మండలం లోని అన్ని పంచాయతీల ఇందిరమ్మ కమిటీలు, పెనుబల్లి మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వాహన పార్కింగ్ షెడ్ల ప్రారంభం



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు ఏరియా పీవి కాలనీ నందు సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో పివి కాలనిలో ఎంసి క్వార్టర్స్ నందు కార్మికుల సౌకర్యార్థం రూ.1 కోటి 27 లక్షల వ్యయంతో మొత్తం 35 బ్లాక్ ల లోని క్వార్టర్స్ నందు ఉద్యోగులు తమ వాహనాలు పెట్టుకొనుటకు వీలుగా పార్కింగ్ షెడ్లను నిర్మించడం జరిగింది. ఈ నిర్మించబడ్డ కార్ షెడ్లను శుక్రవారం ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మాట్లాడుతూ మణుగూరు ఏరియాలో సింగరేణి ఉద్యోగులు, అధికారులు, యూనియన్ నాయకుల సమిష్టి కృషితో నిర్దేశిత లక్ష్యాలను మించి ఉత్పత్తి సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. ఏరియా ఉద్యోగుల నిబద్ధతను దృష్టిలోఉంచుకొని వాహనాల పార్కింగ్ సౌకర్యం కొరకు యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లగా వారు సానుకూలంగా స్పందించి వాహన పార్కింగ్ కొరకు ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఉద్యోగుల సౌకర్యాలు, సంక్షేమం విషయంలో యాజమాన్యం ఎల్లప్పుడు సానుకూల దృక్పదంతో ఉంటుంది కాబట్టి ఉద్యోగులందరు తమ వంతు బాధ్యతగా రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిలో మణుగూరు ఏరియా మరిన్ని రికార్డులు సాధించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం డి, శ్యామ్ సుందర్, ఏజిఎం (సివిల్) డి వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజినీర్ ఆర్. శ్రీనివాస్, ఏజిఎం (ఐఈడి) కె వెంకట్ రావు, డిజిఎం(పర్సనల్) ఎస్ రమేశ్ , ఏరియా రక్షణ అధికారిడి వెంకట రామారావు, ఏరియా సర్వే అధికారి ఎల్ దయాకర్, ఎస్ఈ (ఈఅండ్ఎం) ఎన్ మధుసూదన్, శోభన్ బాబు, పర్యావరణ అధికారి జె. శ్రీనివాస రావు, వై.ఎస్ఈ (సివిల్) ప్రవీణ్, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, ఏఐటియూసి యూనియన్ నాయకులు రామ్ నర్సయ్య, ఐఎన్టీయూసీ నాయకులు వి. కృష్ణం రాజు, మణుగూరు ఏరియా సిఎంఓఏఐ రిప్రెసెంటేటివ్ పి. రమేశ్, సీనియర్ ఎస్టేట్స్ అధికారి బాబుల్ రాజ్, సివిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు అందజేత



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండలంలో ఉన్నటువంటి వివిధ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎంఎల్ఏ జారే ఆదినారాయణ చేతుల మీదుగా ఇంటికి సంబంధించిన ధ్రువపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదవాడి పక్షాన ఎప్పుడూ ఉంటుందని, పేదవాడి సొంత ఇంటి కలలు నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు పని చేస్తుందన్నారు. అందులో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు అధికారిక ధ్రువపత్రం అందజేయడం జరిగిందని, ప్రతి ఒక్కరు కూడా సకాలంలో ఇంటి నిర్మాణాలను చేసుకోవాలని, లబ్దిదారులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా సహకరించానలి తగిన సూచనలు సలహాలు తెలిపారు. మండలంలో భీమునిగూడెం 13 మంది లబ్ధిదారులకు, పెద్దిరెడ్డిగూడెం 36 మంది లబ్దిదారులకు, అన్నపురెడ్డిపల్లి 54 మంది లబ్దిదారులకు ఇండ్ల పట్టాలను అందజేశారు. ఎవరు నిరాశ చెందవద్దని తర్వాత వచ్చే మూడో ఫేజ్‌లో అర్హులైన మిగిలిన వారికి ఇల్లు వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో మహాలక్ష్మి , వ్యవసాయ అధికారి అనూష, హౌసింగ్ ఏఈ రాము, పంచాయితీ కార్యదర్శులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వనమా గాంధీ, పరస వెంకటేశ్వర్లు, వేముల రమణ, యువజన అధ్యక్షులు వేముల నరేష్, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, దుబ్బాకలో రాము, నేరెళ్ల లాలయ్య, బాణావతి భీముడు, రుంజ శ్రీను, రామ్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన యువత అన్ని రంగాల్లో ముందుండాలి

**ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజాపక్షం/దమ్మపేట: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని గిరిజన ప్రాంతాలు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ ప్రజలకు, మైదాన ప్రాంతాల్లోని వలస గిరిజన యువతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. ఇందులో భాగంగానే శుక్రవారం దమ్మపేట పోలీస్‌ల ఆధ్వర్యంలో దమ్మపేట మండలంలోని కొండ రెడ్ల గ్రామమైన పూసుకుంటలో ఉండే 12 మంది యువకులకు దమ్మపేట పోలీస్‌ల ఆధ్వర్యంలో డ్రైవింగ్ లైసెన్సులను ఇప్పించడం జరిగింది. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ చేతుల మీదుగా వారికి లైసెన్స్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో, జెన్సీ ప్రాంతాల్లో నివసించే యువతకు పోలీస్ శాఖ అన్ని రకాలుగా అండగా ఉంటుందని తెలిపారు. వారికి క్రీడా పోటీలు నిర్వహించడం, ఉద్యోగాలు సాధించేలా వారిని ప్రోత్సహించి కోచింగ్ ఇప్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఎంతోమంది ఏజెన్సీ ప్రాంత యువత మద్యానికి బానిసలై వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురై తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని అన్నారు. కనీసం డ్రైవింగ్ లైసెన్సులు కూడా లేకుండా పోలీసుల వాహన తలిఖీలలో పట్టుబడుతున్నారని అన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాలలో నివసించే యువతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రైవింగ్ లైసెన్స్ లను ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పూసుకుంట గ్రామ యువతను వారి గ్రామ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి గొప్ప వరం

**పినపాక శాసన సభ్యులు పాయం**



ప్రజాపక్షం/పినపాక: కాంగ్రెస్ తోనే పేదలకు న్యాయం జరుగుతుందని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పినపాక రైతు వేదికలో ఏర్పాటుచేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అవినీతి లేకుండా పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం లోనే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పేదింటి ఆడబిడ్డలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటూ ఇందిరమ్మ ఇల్లులు, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఉచిత బస్సు ప్రయాణం, కళ్యాణ లక్ష్మి వంటి అనేక పథకాలను పార్టీలకతీతంగా అందిస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ పేద ప్రజల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని, బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో పేద ప్రజలు ఎంతో ఇబ్బందులకు గురయ్యారన్నారు. అందుకే ఆ పార్టీని పక్కకు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఎంచుకున్నారన్నారు. అనేక భూ సమస్యలతో ధరణి ఏర్పడితే, భూ వివాదాలను పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం భూమాత తీసుకువచ్చిందన్నారు. ఇక తెలంగాణలో భూ వివాదాలకు తావు లేదన్నారు. రేషన్ కార్డులు కూడా లేని వారికి రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతూ ఉందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో పాలనలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మి దేళ్లు పాలించి అప్పుల తెలంగాణగా మార్చారని మండిపడ్డారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి చేసిన ప్రభుత్వం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. ప్రస్తుత సీజన్లో జీలుగు విత్తనాలు సైతం 50% సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 31 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు సైతం అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ నాగయ్య, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం, కాంగ్రెస్ మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకం పనులపై ప్రభుత్వం వెంటనే సమగ్రంగా విచారణ జరిపించాలి




**-పాత డిజైన్ ప్రకారమే సీతారామ ప్రాజెక్ట్ కాలువ నిర్మాణం చేపట్టాలి**
**-రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ముగ్గురు మంత్రులకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సూటి ప్రశ్న**

ప్రజాపక్షం/ములకలపల్లి: సీతారామ ప్రాజెక్ట్ కాలువ నాసిరకంగా నాణ్యత లేని కట్టడాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్రంగా విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో పరిధిలోని మాధారం, పూసుగూడెం అడివి ప్రాంతంలో పాస్ వే పిల్లర్ కూలిన ఘటన స్థలాన్ని సిపిఎం బృందం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు కాలువ కట్టడాలు డొల్లతనంతో నిర్మాణ కట్టడాలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపించాకుండా మండల పరిధిలోని వికె రామావరంలో ఉన్న పంప్ హౌస్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏట్లా ప్రారంభోత్సవం చేస్తారని సూటిగా ప్రశ్నించారు. సీతారామ కాలువ తవ్వి బయట పోసిన మట్టి మీద సరైన బెస్ లేని మట్టి మీద పాస్ వే పిల్లర్లు కూలిపోయి కాలువ ప్రవాహానికి ఆటంకం అలుగుతుందన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణ ప్లాన్‌లో 3 రిజర్వాయర్లును ఏర్పాటు చేయాలని ప్లాన్ ఉన్నప్పటికీ దాని ఎత్తేసి ప్లాన్ మార్చి ఇప్పుడు పంప్ హౌస్ ద్వారా నడిపించాలని చూస్తున్నారని, మొదటి ప్లాన్ ప్రకారం రిజర్వాయర్లను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. పంప్ హౌస్ దగ్గర కూడా అనేక చోట్ల క్రాక్‌లు వచ్చాయని అన్నారు. సీతారామ ప్రాజెక్ట్ కాలువ ఆయకట్టు 6లక్షల 75 ఎకరాల భూములకు సాగు నీరు అందించాలని, డిజైన్‌లో ఉందని ఉమ్మడి జిల్లా ముగ్గురు మంత్రులు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీరు సస్యశ్యామలంగా అందిస్తామని పెద్ద ప్రకటనలు చేస్తున్నారని జిల్లా రైతాంగాన్ని మోసం చేస్తున్నారని ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఈ కాలువ నిర్మాణం సుమారు 1000 కిలోమీటర్ల దూరం ఉందని మొట్టమొదటి డిజైన్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రిజర్వాయర్‌ను ఏర్పాటు చేసి జిల్లా రైతాంగానికి డిస్ట్రిబ్యూటర్ కాలువల ద్వారా సాగునీరు అందించాలని డిజైన్‌లో ఉందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం డిజైన్ మార్చి జిల్లా రైతాంగానికి అన్యాయం చేస్తుందన్నారు. ప్రభుత్వం సీతారామ ప్రాజెక్ట్ నాసిరకం కట్టడాలపై సమగ్రంగా విచారణ జరిపించి దీనికి బాధ్యులైనవారందరిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సీతారామ ప్రాజెక్ట్ కాలువలో నాసిరకం లోపాలను సరిదిద్దే పనులు చేయకపోతే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతాంగాన్ని సమీకరించి ఉద్యమ పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు కనకయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా నాయకులు కొండబోయిన వెంకటేశ్వర్లు, సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, పాల్వంచ సిపిఎం మండల కార్యదర్శి పాకాల వెంకట్రావు, వూకంటి రవికుమార్, నిమ్మల మధు, గొగ్గల ఆది నారాయణ, కుంజా రాంమూర్తి, బైరు ప్రసాద్, పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/కారేపల్లి: మండల కేంద్రంలో కమ్మలగుంట ప్రాంతంలో జరిగే ఉపాధి హామీ పనుల ప్రదేశంలో వైరాలో జరగబోయే మెగా జాబ్ మేళాకు యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని పంచాయితీ కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగులు మెగా జాబ్ మేళాకు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చొరవతో వైరా ఎంఎల్ఏ రాందాస్ నాయక్ సింగరేణి కాలరీస్ సహకారంతో హైదరాబాద్ వెళ్లకుండానే 80 ప్రైవేట్ సంస్థల సహకారంతో 5000 ఉద్యోగ అవకాశాలు వైరాలో ఈనెల 24వ తేదీన శనివారం ఉదయం 9గంటల నుండి ప్రారంభిస్తున్నట్లు ఈ అవకాశాన్ని సింగరేణి మండల పరిధిలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మెగా జాబ్ మేళాకు నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జాబ్ మేళాలో అర్హత సాధించాలని కోరారు. అర్హతలో భాగంగా సెవెంత్, టెన్త్ పాస్, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్, పీజీ, ఫార్మసీ వంటి కోర్సులలో అర్హతను వినియోగించుకొని జాబ్ మేళాలో పాల్గొనాల్సిందిగా కోరారు. జాబ్ మేళాకు సంబంధించి క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ చేసి నమోదు చేసుకుని సద్వినియోగం ఉందని తెలిపారు. సింగరేణి టౌన్, చీమలపాడు, మాదారం, భాగ్యనగర్ గ్రామాలలో బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నెహ్రూ, ఎస్సీ సెల్ అధ్యక్షులు మేదరి టోనీ, సొసైటీ డైరెక్టర్ ఐలయ్య, సురేందర్ మనియార్, తాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## నియామకాల్లో భూనిర్వాసితులకు ప్రాధాన్యత నివ్వాలి




ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు ఏరియా సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పీవీ కాలనీలో నిర్వహించబడుతున్న సింగరేణి హై స్కూల్ లో ఉపాధ్యాయులు, సిబ్బంది నియామక 2025 వేకెన్సీ ఫిల్లింగ్ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల సామాజిక సేవకులు కర్నే బాబురావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నోటిఫికేషన్ ద్వారా అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి దొరికే అవకాశం ఉందనీ ఈ సందర్భంగా సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియశారు. అలాగే ఈ నియామకాలలో మణుగూరు ప్రాంత సింగరేణి భూ నిర్వాసితులకు ప్రాధాన్యత ఇస్తే సింగరేణి సంస్థకు తమ భూములు ఇవ్వడం ద్వారా మాకు ఉపాధి కల్పించారు అనే సంతృప్తి వారికి కలుగుతుందన్నారు. దయచేసి సింగరేణి భూ నిర్వాసితులకు సింగరేణి పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది నియామకాలలో తగు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే అర్హులకు న్యాయం జరిగే విధంగా విమర్శకు తావు లేకుండా నియామకాలు ఉండాలని కూడా తగు సూచనలు కూడా ఇవ్వాలని కోరారు.

## పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని గుంపెన గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన సభ్యులు జారే ఆదినారాయణ హాజరయ్యారు. సహకార సంఘం ఛైర్మన్ బోయినపల్లి సుధాకర్‌రావుతో కలిసి రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని, రైతుల కొరకు వ్యవసాయానికి సకాలంలో ఎరువులు అందించడం కూడా జరుగుతుందని, ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. భూమికి చావను పెంచే పచ్చిరొట్ట విత్తనాలను రైతులందరూ కూడా తీసుకువెళ్లి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వానకాలం సాగుకు ముందే రైతు భరోసా అందించబడుతుందని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. ఈకార్యక్రమంలో అశ్వారావుపేట అదనపు వ్యవసాయ అధికారి రవికుమార్, మండల వ్యవసాయ అధికారి అనూష, సహకార సంఘం వైస్ ఛైర్మన్ వెంకట్‌నారాయణ, సీఈవో సురేందర్, మాజీ వైస్ ఎంపీపీ మామిళ్ళపల్లి రామారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వనమా గాంధీ, పరస వెంకటేశ్వర్లు, నేరెళ్ల లాలయ్య, యువజన అధ్యక్షులు వేముల నరేష్, దుబ్బాకుల రాము, బాణావత్ భీముడు, రాజకీయ నాయకులు, రైతులు, సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి కృషితో..
# మరో కోనసీమగా మారనున్న పాలేరు రిజర్వాయర్..!

**- మున్నేరు వరదను ఒడిసిపటి పాలేరు రిజర్వాయర్‌కు నీటి మళ్లింపు**
**- మంత్రి పొంగులేటి కృషితో రూ.162.54కోట్లు మంజూరు**
**- ఆనందంలో పాలేరు నియోజకవర్గ రైతులు**







**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** ప్రతి సంవత్సరం వర్షాకాలం సమయంలో మున్నేరు నుండి వందలాది క్యూసెక్కుల నీరు వృధాగా సముద్రం పాలు అవుతున్న తరుణంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కృషితో మున్నేరు వరదను సీతారామ గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరు రిజర్వాయర్‌ను నింపేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.162.54 కోట్లు మంజూరు చేయగా ఇందుకు సంబంధించి జీవో నెంబర్ 98ని విడుదల చేయటంతో పాలేరు నియోజకవర్గ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పాలేరు రిజర్వాయర్ నుంచి భక్త రామదాసు ఎత్తిపోతల ద్వారా పాలేరు నియోజకవర్గం లోని తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల చెరువులకు నీరందిస్తున్నారు. సీతారామ పనులు పూర్తయితే పూర్తిగా పాలేరు నియోజకవర్గం సాగునీరుకు, తాగునీరుకు ఎలాంటి డోకా ఉండదు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముందు చూపుతో డోర్నకల్ వద్ద మున్నేరు వరదను కరెంట్ ఖర్చు గాని మోటర్ల ఖర్చు లేకుండా వచ్చే వర్షం ద్వారా వచ్చే మున్నేరు వరదను సీతారామ గ్రావిటీ కెనాల్‌కు మళ్లించి పాలేరు రిజర్వాయర్‌ను నింపడంతో పాలేరు రిజర్వాయర్ ఎంత ప్రతికూల పరిస్థితులు ఎదురైనా గరిష్టానికి నీటి మట్టం తగ్గకుండా ఉంటుందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. తద్వారా పాలేరు నియోజకవర్గంతో పాటు సాగర్ ఆయకట్టుకు కూడా గోదావరి మున్నేరు వరద నీళ్లు అందించవచ్చని తెలిపారు. పాలేరు రిజర్వాయర్ ద్వారా ఇప్పటికే సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు మిషన్ భగీరథ నీళ్లు వెళ్తున్నాయని, మున్నురు వరద నీరు మళ్లింపు ద్వారా తాగునీరుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, వ్యవసాయ సాగు కోసం డోర్నకల్ నియోజకవర్గం పరిధిలో పది చెరువులకు సాగునీరు అందుతుందని అధికారులు తెలిపారు. మున్నేరు వరద మళ్లింపు ద్వారా పాలేరు రిజర్వాయర్ పరిధిలో 2.54లక్షల ఎకరాల ఆయకట్టు సాగుకు నీరు అందుతుందని, ఒక్క పాలేరు నియోజకవర్గంలోనే 1.30లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. రానున్న రోజుల్లో పాలేరు నియోజకవర్గం భక్త రామదాసు, సీతారామ, మున్నేరు వరద మళ్లింపుతో మరో కోనసీమగా పాలేరు నిత్యం సాగునీరు, తాగునీరుతో కళకళలాడబోతుంది. పాలేరు శాసనసభ్యులు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కృషితో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మున్నేరు వరదను పాలేరు రిజర్వాయర్‌కి పంపించేందుకు రూ.162.54 కోట్లు మంజూరు చేయటం పట్ల పాలేరు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు సంతోషం వ్యక్త ం చేస్తున్నారు.

# కెజి సిరిపురంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

**-అంతర్గత రోడ్లను కమ్మేసిన ముళ్లపొదలు**
**-గ్రామంలో అధికారికి పర్యవేక్షణ ఉందా?**





**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలానికి కెజి సిరిపురం గ్రామంలో అభివృద్ధి మాట ఏమో గాని గ్రామంలో ఉన్న సమస్యలను పట్టించుకునే నాదుడే కనిపించడం లేదు. గ్రామంలో అంతర్గత రోడ్లు పిచ్చిమొక్కలు ముళ్లపొదలతో దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీలు పూర్తిగా కనిపించకుండానే చెత్తతో మొక్కలతో నిండిపోయాయి. చేతినీరు తెచ్చుకునే చేతి పంపు ముళ్లపొదల మధ్య దర్శనమిస్తుంది. ఆ చేతిపంపు చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలతో ఎలాంటి విష సర్పాలు వస్తాయో తెలియని పరిస్థితి. రోడ్లపై నడవాలంటే రాత్రిపూట ఆందోళన చెందుతున్నారు. ఆ గ్రామ సమస్యలు గ్రామపంచాయతీ కార్యదర్శికి కనిపించడం లేదా, ప్రజా సమస్యలు పరిష్కారం అంటే ఇదేనా. గత కొన్ని రోజులుగా గ్రామంలో పారిశుద్ధ్యం పనులు చేపట్టిన సందర్భాలే లేవని ప్రజలు తెలుపుతున్నారు.అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా కనిపిస్తున్నాయి. డ్రైనేజీలను శుభ్రం చేసిన పరిస్థితి అక్కడ కనిపించడం లేదు. ఇలా అయితే ఎలా గ్రామాల అభివృద్ధి ధ్యేయమని పదేపదే ప్రభుత్వం చెబుతుంటే దానికి భిన్నంగా సిరిపురం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా పూడిక తీయకుండా ఉండటంతో పాటు పారిశుద్ధ్యంపై పట్టింపు లేకుండా చేస్తున్నారు. ప్రతిరోజు పంచాయతీ కార్యాలయానికి వచ్చే గ్రామపంచాయతీ కార్యదర్శి ఇవి కనిపించడం లేదా, ఆ కార్యదర్శి గ్రామంలో పర్యటిస్తున్నాడా అనేది కూడా ఇప్పుడు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే అతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా ముళ్లపొదలతో ఉంది కనిపించడం లేదా ఇలా ఉంటే నీరు తెచ్చుకోవడానికి భయపడరా, ఇప్పటికైనా జిల్లా అధికారులు గ్రామపంచాయతీలో ఉన్న పారిశుద్ధ్యంపై దృష్టి సారించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# లక్ష్మీనర్సయ్య ఆశయాలు కొనసాగించాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్లలో సిపిఐఎం సీనియర్ నాయకులు యాసా లక్ష్మీనర్సయ్య 5వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య పూలమాలవేశారు. ఈసందర్భంగా యాసా ప్రభాకర్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సబ్యులు బొంతు రాంబాబు మాట్లాడుతు లక్ష్మీనర్సయ్య ఆశయాలను అందరం కొనసాగించాలని అన్నారు. కమ్యూనిస్టుపార్టీ అభివృద్ధికోసం ఆయన ఎంతో కృసిచేశాడని కొనియాడారు. లక్ష్మీనర్సయ్య వర్ధంతి తోపాటు గ్రామంలోని పెదమళ్ల అప్పారావు 25వ వర్ధంతి కార్యక్రమాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, జిల్లా కమిటీ సబ్యులు తాళ్లపల్లి కృష్ణ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ రంజాన్, చల్లా నారాయణ, చింతనిప్పు సూర్యం, యాసా తిలక్, పాపిట్ల ప్రసాద్, జోనెబోయిన నరసింహారావు, లక్ష్మీనర్సయ్య కుమారులు యాసా వెంకటేశ్వర్లు, కృష్ణయ్య పాల్గొన్నారు.

# గిరిప్రసాద్ వర్ధంతి సభను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడు. సాయుధ తెలంగాణ పోరాట యోధుడు నల్లమల గిరిప్రసాద్ వర్ధంతి సభ ఈనెల 24న శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ఖమ్మం రిక్కా బజార్ హైస్కూల్‌లో జరుగుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. 29వ వర్ధంతి సందర్భంగా జరుగుతున్న ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శి డా॥ కె. నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా తదితరులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. పాత బస్టాండ్ సమీపంలో గల గిరిప్రసాద్ విగ్రహాన్ని ముస్తాబు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని సురేష్ కోరారు. ఇదిలా ఉండగా పాత బస్టాండ్ వద్ద గల గిరిప్రసాద్ కాంస్య విగ్రహ సుందరీకరణ పనులను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్ తదితరులు పరిశీలించారు.

# పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను మండల పరిధిలోని మంచుకొండ సొసైటీలో శుక్రవారం పంపిణీ చేశారు. ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై రైతులకు జనుములు, జిలుగు విత్తనాలను పంపిణీ చేస్తుందని ఆయన తెలిపారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాయితీ విత్తనాల కోసం రాయితీలు తమ క్లస్టర్ పరిధిలోని ఏఈవో వద్ద కూపన్ పొందాలని ఆయన తెలిపారు. ఆ కూపన్లు సొసైటీ వద్ద ఇచ్చి రాయితీ విత్తనాలను తీసుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ ఉండాలన్నారు. మంచుకొండ, రఘునాథపాలెం సొసైటీలో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ ఛైర్మన్ తుమ్మలపల్లి మోహన్‌రావు, సొసైటీ సిఈవో శ్రీనివాసరావు, ఉయ్యూరు వెంకట నారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అనాధికార నిర్మాణం కూల్చివేత



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అనాధికారికంగా నిర్మిస్తున్న కట్టడాన్ని ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు తొలగించారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురం రోడ్డు నెం.7లో ఎటువంటి అనుమతులు లేకుండా అనాధికారికంగా నిర్మిస్తున్న కట్టడాన్ని అధికారులు తొలగించారు. ఇటీవల ఖమ్మం నగరంలో అనాధికార కట్టడాల కోసం ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉండే నిర్మాణాలను గుర్తించి వాటిని తక్షణమే తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిబంధనలకు అనుగుణంగానే భవన నిర్మాణాలు చేపట్టాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజల సహకారంతో ఖమ్మం నగరాన్ని పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అధికారులు తెలిపారు.

# ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

**ప్రజాపక్షం/కొణిజర్ల :** శ్రమదోపిడి ఉన్నంతకాలం కమ్యూనిజం, నక్సలిజం ఉంటుందని సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు షేక్ ఖాసిం అన్నారు. కొణిజర్లలో శుక్రవారం ఆయన మాట్లాడుతు ఛత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్ లో మావోయిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి సంబాల కేశవరావు తోపాటు పలువురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈదేశంలో ఉన్న కార్పోరేట్ సంస్థలకు అడవి గుట్టల్లో ఉన్న ఖనిజ సంపదను కట్టబెట్టడానికి అడవి బిడ్డలకు అండగా ఉన్న మావోయిస్టులను చంపి అడవిబిడ్డలను అడవులనుంచి ఖాళీచేయించాలనే ఉద్దేశ్యంతో మావోయిస్టులను కాల్చిచంపడమే లక్ష్యంగా బిజేపి ప్రభుత్వం పనిచేస్తుందని ఆరోపించారు. ఎన్‌కౌంటర్ తర్వాత దేశహోంమంత్రి సంబరాలు చేసుకున్నారని దీంతో అమిత్‌షా క్రూరత్వం బయటపడిందని విమర్శించారు. కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తున్న మావోయిస్టుల అణచివేత ధోరణిని అన్ని రాజకీయపార్టీలు ముక్తకంఠంతో ఖండించాలని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

# మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి




**-బూటకపు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన వారికి సిపిఐ నివాళి**

**ప్రజాపక్షం/ఖమ్మం :** మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని మధ్య భారతంలో ఆదివాసీలపై జరుగుతున్న ప్రచ్చన్న యుద్ధాన్ని ఆపాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ఆదివాసీల అంతం కోసం దండకారుణ్యంలో నెలకొన్న ప్రకృతి సంపదను కాజేసేందుకే మావోయిస్టుల మాటున ఆదివాసీలను తరిమివేస్తున్నారని ఆయన ఆరోపించారు. శుక్రవారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో కర్రెగుట్ట అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ మధ్య భారతంలో మావోయిస్టు కార్యకలాపాల కారణంగా అపారమైన ఖనిజ సంపద రక్షించబడిందని ఇప్పుడు ఆ సంపదను దోచుకునేందుకే ఆపరేషన్ కగార్ ప్రారంభమైందన్నారు. విదేశాలతోనూ, ఉత్తర భారతంలోని అనేక మిలిటెంట్ గ్రూపులతో శాంతి చర్చలు జరిపిన కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపేందుకు ఎందుకు స్పందించడం లేదని సురేష్ ప్రశ్నించారు. ఇటీవల కాలంలో ఆపరేషన్ కగార్ పేరుతో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు,జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, బిజి క్లైమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి , మిడికంటి వెంకటరెడ్డి, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తాటి నిర్మల, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, నూనె శశిధర్, జ్వాలా నర్సింహారావు, నంబూరు శంకర్‌రావు పాల్గొన్నారు.

# మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజాపక్షం/వైరా:** వైరాలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్ర డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క సారధ్యంలో సింగరేణి సంస్థల సహకారంతో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాలను నిరుద్యోగ యువత యువకులు సద్వినియోగం చేసుకోవాలని వైరా నియోజకవర్గ మాజీ యువతజన కాంగ్రేస్ అధ్యక్షుడు పమ్మి అశోక్ అన్నారు. శుక్రవారం వైరాలో పమ్మి అశోక్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అండగా ఉండాలని ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ జాబ్‌మేళా ఎంతో మంది నిరుద్యోగులకు అండగా ఉండబోతుందని తెలిపారు. శనివారం ఉదయం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే మెగా జాబ్‌మేళాకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఈజాబ్‌మేళాలో 5వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలను 80 ప్రైవేటు కంపెనీలు కల్పించనున్నాయని అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలేటి నర్సింహారావు, తోటకూర గోపి, మల్లు రామకృష్ణ, ధరావత్ శంకర్‌నాయక్, కంభంపాటి సత్యనారాయణ, కుమ్మరికుంట్ల ఉపేందర్, చల్లగొండ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# జరిగిన అభివృద్ధి మీ కళ్ళముందే ఉంది..

**-ఎమ్మెల్యే మట్టా రాగమయి**

**-ప్రభుత్వం కష్టాల్లో ఉన్నా.. పథకాలు అమలు చేస్తుంది : ఎంపి**









**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మేం గెలిచిన 15 నెలల్లో సత్తుపల్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ప్రజల కళ్ళ ముందుందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ప్రభుత్వం కష్టాల్లో ఉన్న ప్రజలకు పథకాలు అందించడంలో రేవంత్ సర్కార్ ముందుందని జిల్లా ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి అన్నారు. సత్తుపల్లి మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేసే కార్యక్రమం శుక్రవారం పట్టణంలోని రాణి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ కోసం లంచం అడుగుతున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయని, ఏ స్థాయిలో అడిగినా వెంటనే ఫిర్యాదు చేయమని తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా అనేక కష్టాల్లో ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేందుకు దృఢ సంకల్పంతో పని చేస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో లబ్ధిదారులు లంచం ప్రోత్సహిస్తే ప్రభుత్వ లక్ష్యం నీరుగారే ప్రమాదం ఉందన్నారు. ఒకపక్క కోట్లాది రూపాయల విలువ చేసే పథకాలు నడుస్తున్నప్పటికీ మరోవైపు పేదల హామీ నెరవేర్చేందుకు ఏడాదికి నాలుగున్నర లక్షల కోట్లు ఇందిరమ్మ పథకం కోసం ఖర్చు చేయడం జరుగుతుందన్నారు.. మొదటి ఫేసులో నియోజవర్గానికి 3,500 ఇళ్లు ఇచ్చామని,ఫేస్ వారీగా అర్హులందరికీ మంజూరు చేస్తామన్నారు. పదేళ్లలో ఏది చేయలేని బీఆర్ఎస్ ప్రభుత్వం, కాంగ్రెస్ పథకాలు చూసి ఓర్వలేక విమర్శలకు దిగుతుందన్నారు. లబ్ధిదారులు సమర్థవంతంగా తిప్పి కొట్టాలని కోరారు. శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో పథకాలు పేపర్ల మీదే ఉన్నాయన్నారు. అవి కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మాణానికి నోచుకుంటున్నట్లుగా తెలిపారు. ఇంత అభివృద్ధి జరుగుతున్నా గుడ్డి వాళ్ళ మాదిరి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నట్లు తెలిపారు. గడిచిన పది సంవత్సరాల్లో సత్తుపల్లికి 140 ఇండ్లు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే నియోజకవర్గానికి 3,500 ఇచ్చామన్నారు. లబ్ధిదారులు అపోహలకు తావివ్వకుండా ప్రభుత్వం ఇచ్చిన డిజైన్ ప్రకారం ఇల్లు నిర్మించుకోమని కోరారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అక్కసుతో ఆరోపణలు చేస్తున్నాయని ప్రజలంతా వాటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు దోమ ఆనంద్ బాబు, నీరజా ప్రభాకర్ చౌదరి, డిసిసిబి డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, హౌసింగ్ డిఈఈ విక్రమ్, మున్సిపల్ కమిషనర్ నరసింహ, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో నాగేశ్వరరావు, నాయకులు చల్లగుండ్ల నరసింహారావు, నారాయణ వరపు శ్రీనివాసరావు, గాదె చెన్నారావు, సిపిఐ రాష్ట్ర నాయకులు దండు ఆదినారాయణ, నరుకుళ్ళ అప్పారావు, తోట సుజల రాణి గణేష్, కమల్ పాషా, మానుకోట ప్రసాద్, దొడ్డా శ్రీనివాసరావు, ఇమ్మనేని ప్రసాద్, వినుకొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లచేతికి మొబైల్స్, బైకులు ఇవ్వద్దు



**ప్రజాపక్షం/వైరా:** తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు ద్విచక్రవాహనాలు మొబైల్స్ ఇవ్వద్దని వైరా ఎస్సై పి.రామారావు అన్నారు. ఈ సందర్భంగా పి.రామారావు మాట్లాడుతూ వాహనాలను తోలేటప్పుడు ఆ వాహనాలకు నెంబర్ ప్లేట్స్ లేకుండా తోలవద్దని నెంబర్ ప్లేట్స్ లేకుండా రోడ్లపై వాహనాలు కనిపిస్తే కేసులు నమోదు చేస్తామని, ద్విచక్ర వాహనాలతో పెద్దపెద్ద సైలెన్ సర్ సౌండ్ చేస్తూ నడపవద్దని అలా నడిపే వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని, మైనార్టీ తీరని పిల్లలకు ద్విచక్ర వాహనాలను నడపవద్దని, అదేవిధంగా పిల్లలకు సెల్‌ఫోన్లు ఇచ్చి వారి భవ్యిత్తును పాడుచేయవద్దని సూచించారు. రోడ్లపై సెలెన్సర్ శబ్దాలు చేసుకుంటూ అతివేగంగా వాహనాలు నడపుతున్నారని, అలా అతివేగంగా వాహనాలు నడపడం, ప్రమాదాలకు కారణం అవుతాయని తెలిపారు. ముఖ్యంగా యువత మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని ఆయన సూచించారు.

# సుజాతనగర్‌లో ఎమ్మార్పీఎస్ కమిటీ




**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మూడు మండలాల ఇంచార్జ్ నల్లగట్ల వెంకన్న అధ్యక్షతన జరిగిన ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జాతియ కోర్ కమిటీ సభ్యులు ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు తగరం నరసింహారావు మాదిగ హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం పోరాటం 30 ఏళ్ల ఉద్యమమని ప్రపంచ చరిత్రలో ఒక జాతి ఉద్యమం ఇంతకాలం సుదీర్ఘంగా పోరాటి హక్కులు ఆత్మగౌరవం రాజ్యాధికారం సాధించే దిశగా ముందడుగు వేయలేదని, అంతిమం వరకు పోరాడి హక్కులు సాధించుకుంది ఈ ఎమ్మార్పీఎస్ అని అన్నారు. వివక్ష ఉన్నంతవరకు ఎమ్మార్పీఎస్ ఉంటుంది. సమాజంలో సమానత్వం సామాజిక న్యాయం కులాలకు మతాలకు అతీతంగా అందరికీ వివక్ష లేని సమాజ నిర్మాణం కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నిరంతరం దండోరా ఉద్యమం పీడిత వర్గాలకు అండగా పోరాడుతుందని ఎంఎస్పి ఎంఆర్పీఎస్ జాతీయ నాయకులు ఉమ్మడి జిల్లాల ఇన్చార్జి ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ పిలుపునిచ్చారు. సుజాతనగర్ మండల కమిటీ సమావేశానికి నల్లగట్ల వెంకన్న అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ పాల్గొని ప్రసంగించారు. మూడు దశాబ్దాలకు ముందు కులం పేరు చెప్పుకోలేని మాదిగ జాతి ఈ రోజున సమాజానికి దిక్సూచిగా నిలిచి పీడిత కులాలకు పోరాట స్ఫూర్తిని రగిలించిన ఆ మహనీయుడు పద్మశ్రీ మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆయన అడుగుజాడల్లో సమాజాన్ని సామాజిక న్యాయం వైపు నడిపించి బడుగులకు రాజ్యాధికారం సాధించి సాధించడానికి ఎమ్మార్పీఎస్ నిరంతరం కొనసాగుతుందని ఈ ఆలోచన దిశగా యావత్ మాదిగ జాతి రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా నిలబడి అణగారిన కులాలకు ఐక్యం చేయడానికి మాదిగ జాతి కృష్ణ మాదిగ అండగా నిలబడాలని ఏపూరి పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు తగరం నరసింహారావు మాదిగ మాట్లాడుతూ 30 సంవత్సరాల పోరాటం జాతిని ఐక్యం చేసి రాజ్యాధికారం సాధించిందని ఆయన గర్వంగా చెప్పారు. కార్యక్రమం అనంతరం సుజాతనగర్ మండల ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ గా చర్ల నవీన్, కో కన్వీనర్ గా దంసలపురి నాగరాజు, సోషల్ మీడియా కన్వీనర్ గా కత్తి బాలకృష్ణను నియమించడం జరిగింది. గౌరవ సలహాదారులుగా వేల్పుల భాస్కర్, కత్తి వెంకన్న, కనుకుంట్ల నిర్మల, దామెర్ల సర్వయ్య, పెంబల నరసింహారావు, కాకాటి తిరుపతిరావు, సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకులు కాకాటి బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్.. సింధూర్‌లో ఉన్న

# అసలు నిజాలు బహిర్గతం చేయాలి




**ప్రజాపక్షం/ఇల్లెందు:** భాజపా ప్రభుత్వం పహల్గాం, అబుజు మాడ్‌లపై న్యాయవిచారణ చేసి ఆపరేషన్ కగార్, సింధూర్‌లో దాగి ఉన్న అసలు నిజాలు బహిర్గతం చేయాలని సీపీఐ(ఎం.ఎల్.) న్యూడెమోక్రసి జిల్లా సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని పిన్నన్నర్ల భవనంలో శుక్రవారం ఎన్డీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో మాట్లాడారు. పహల్గాం పర్యాటకుల ప్రాంతమని, అనేక మంది ప్రజలు యాత్రలకు వస్తూ ఉంటారని, భద్రతా బలగాల లోపాల వల్లనే దాడి జరిగిందని ఆరోపించారు. 163దేశాల సభ్యత్వాలు ఉన్న యూఎన్‌ఓలో చర్చించకుండా భారతపార్లమెంట్‌లో, ప్రతిపక్షాలతో చర్చించకుండా యుద్ధానికి వెళ్లి వెనక్కి రావడంలో ఆంతర్యం ఏమిటో నరేంద్ర మోధీ తెలపాలన్నారు. అకస్మాత్తుగా ఈనెల7న యుద్ధాన్ని ప్రకటించి 10వ తేదీనే యుద్ధాన్ని విరమించడం వెనుక ఆంతర్యం తెలపాలని మోధీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 140కోట్ల ప్రజల శాంతి కోరరుకుంటున్నామని చెప్పిన పాలకులు శాంతి చర్చలకు వస్తామని చెప్పిన మావోయిస్టులతో శాంతి చర్చలు ఎందుకు జరపడం లేదని ప్రశ్నించారు. యుద్ధాలు, ఎన్‌కౌంటర్లు అన్నీ అదాని, అంబానీ కార్పోరేట్ శక్తుల కోసమేనని విమర్శించారు. జరిగిన తీరు కాల్పుల విరమణ ఒప్పందం వీటిలో సామ్రాజ్యవాద శక్తుల పాత్ర. విదేశీ శక్తుల పాత్ర ప్రజలు తెలుసుకోవాలని ఆపరేషన్ పేరుతో జరుగుతున్న హత్యలుపై వాస్తవాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.సారంగపాణి, ఎఐటీఎఫ్ రాష్ట్ర, జిల్లా కన్వీనర్లు సూర్ణపాక నాగేశ్వరరావు, మోకాళ్ల రమేశ్, ఎన్డీ జిల్లా నాయకులు పొడుగు నరసింహారావు, తోడేటి నాగేశ్వరరావు, కల్తి వెంకటేశ్వర్లు, ఎట్టి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో మాజీ మంత్రి పువ్వాడ పర్యటన





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నియోజక వర్గంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విస్తృతంగా పర్యటించి పలు వేడుకల్లో పాల్గొన్నారు. శుక్రవారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలంగాణ ఉద్యమకారుడు, బిఆర్‌ఎస్ నాయకుడు డోకుపర్తి సుబ్బారావు కుమార్తె లోహిత వివాహ వేడుకకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హాజరై నూతన వధువుకు చీరెసారె సమర్పించి రూ. 50వేల పెళ్లి కానుకను అందజేసి ఆశీర్వదించారు. ఖమ్మం హర్ష కన్వెన్షన్ నందు అయితం రవీంద్ర కుమారుడు తరుణ్ రామ్ సిరివెన్నెల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. చింతకాని మండలం కోదుమూరు గ్రామం నందు దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షులు బడే సాహెబ్ కుమారుడు అరిఫ్‌హుస్సేన్ అమీషాబేగం వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. రఘునాథపాలెం మండలం కోయచలక గ్రామం నందు బిఆర్‌ఎస్ నాయకుడు అమరం వెంకటేశ్వర్లు కుమారుడు సందీప్ త్రివేణి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇటీవల మమతలో శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ప్రకాష్ నగర్‌కు చెందిన దడాల మహేష్‌ను పరామర్శించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం రూరల్ మండలం మారెమ్మతల్లి టెంపుల్ నందు కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ మనవడు వేదాన్ష్ అన్నప్రాసన మహోత్సవానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, మండల అధ్యక్షులు వీరునాయక్, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఆర్‌జెసి కృష్ణ, కార్పొరేటర్ కూరాకుల వలరాజు, మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి, మాజీ సర్పంచులు మాధంశెట్టి హరిప్రసాద్, మెంటెం రామారావు, చెరుకూరి ప్రదీప్, కొంటెముక్కుల వెంకటేశ్వర్లు, నున్నా శ్రీనివాసరావు, పాలడుగు పాపారావు, గొల్లపూడి రాంప్రసాద్, చిలకల వెంకట నర్సయ్య, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

**-పెండింగ్ భూ సేకరణపై ఆర్అండ్ఆర్ కమిషనర్ సమీక్ష**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్ అండ్ ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్ అండ్ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి పెండింగ్ భూ సేకరణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నేరు నదిపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్, సీతారామ ఎత్తిపోతల పథకం, జాతీయ రహదారుల నిర్మాణం వంటి వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతులు, భూ నిర్వాసితులతో నేరుగా చర్చిస్తూ ఎటువంటి ఆందోళనలు జరగకుండా సానుకూల వాతావరణంలో భూసేకరణ ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా యాతాలకుంట టన్నెల్, పాలేరు రిజర్వాయర్ లింక్, డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ చేపట్టేందుకు పకడ్బందీ కార్యాచరణ తయారు చేసుకోవాలన్నారు. రైతులకు పరిహారం అందించే అంశంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని, చట్ట ప్రకారం సంపూర్ణ పరిహారం రైతులకు అందేలా అధికారులు పని చేయాలన్నారు. భూ సేకరణ అంశంలో మానవీయ కోణంలో అధికారులు వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు జి. నర్సింహారావు, ఎల్. రాజేందర్‌గౌడ్, ఇరిగేషన్ అధికారులు, కలెక్టరేట్ భూ సేకరణ విభాగ అధికారులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ విద్యారంగానికి మూల స్తంభాలు

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ రంగ విద్యను నిలబెట్టడంలో కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యావనరుల కేంద్రంలో గత నాలుగురోజులుగా జరుగుతున్న ప్రధానోపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించిన ఆయన మాట్లాడారు. మనస్సుపెట్టి పనిచేస్తే సాధించలేనిది ఏదీ లేదని, పాఠశాలలో సహజభాగస్వామ్యాన్ని పెంచుతూ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో తమ వంతు పాత్రని పోషించాలన్నారు. అంతకుముందు పాల్వంచలోని జిల్లా పరిషత్ పాఠశాల్లో జరుగుతున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. శిక్షణ ద్వారా అవగాహన చేసుకున్న అనేక విషయాలు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజు శేఖర్, జీవశాస్త్ర శిక్షణా కేంద్రం ఇంచార్జ్ ఏ పద్మలత, రాష్ట్ర పరిశీలకులు శ్రీహరి, రిరోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

**- ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ పరిదిలోని మారుమూల గిరిజన గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపిడిఓలను ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో దమ్మపేట, అశ్వరావుపేట మండలాల్లోని ఎంపిడిఓలు,కొండరెడ్ల గ్రామాలకు సంబంధించిన పంచాయితీ కార్యదర్శులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు సూచనలు ఇస్తూ బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటూ కొండకోనల్లో నివసించే కొండరెడ్ల గిరిజన కుటుంబాలకు పిఎం జన్మన్ పథకం ద్వారా నివాస గృహాల నిర్మాణం చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అశ్వరావుపేట మండలంలో ఏడు కొండరెడ్ల గిరిజన గ్రామాల హ్యాబిటేషన్లు, దమ్మపేట మండలంలో పూసుకుంట గ్రామంలోని కొండరెడ్ల గిరిజన కుటుంబాలను ఇంటింటికి తిరిగి మొబైల్ యాప్ ద్వారా సర్వేచేసి వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. శనివారం నుండి సర్వే కార్యక్రమం మొదలుపెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, అశ్వారావుపేట, దమ్మపేట ఎంపిడిఓలు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రచారం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలంటూ ఆ పార్టీ కాంగ్రేస్‌న ఆయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. శనివారం వైరాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ నందు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాకు పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతీ యువకులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా టౌన్ కాంగ్రేస్ నాయకులు, దార్న రాజశేఖర్, వీరంశెట్టి సీతారాములు, దుగ్గిరాల జాకోబు, కురిసేటి నడిపి,దురిశెట్టి నర్సింహారావు, ముత్యాల కోటి, మోర్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# న్యూలిటిల్ స్కూల్‌ని సందర్శించిన వీర చక్ర అవార్డు గ్రహీత






**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని న్యూలిటిల్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో మే21 నుండి 30 వరకు జరగనున్న ఎన్‌సిసి శిక్షణ శిబిరానికి ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్.కె.భద్ర, ఏవో కల్నల్ నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి క్యాడెట్ లకు శిక్షణ జరుగుతుంది. శుక్రవారం వరచక్ర అవార్డు గ్రహీత విఆర్‌సి.గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ అన్నారావు నెంబాల్ కర్ క్యాంపును సందర్శించి పర్యవేక్షించారు. శిక్షణలో భాగంగా ఫిజికల్ ట్రైనింగ్, మార్షింగ్, ఆయుధ విజ్ఞానం, నైతిక విద్యా సెషన్లు, నాయకత్వ గుణాలపై వర్క్‌షాపు, కమ్యూనికేషన్ స్కిల్‌స వంటి అంశాలు విద్యార్థులకు, నేటి యువతకు ఎంతో అవసరం కనుక వీటినే నేర్పించేందుకు ఈ శిక్షణా శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అంతేకాకుండా ప్రతిరోజు రెండు గంటలు బుద్ధి వికాస కార్యక్రమాలు జరుగుతాయని అందులో దేశరక్షణ విధానాలు భారత చరిత్ర ఎన్‌సిసి స్థాపన లక్ష్యాలు, సంఘజీవతత్వం, స్వచ్ఛభారత్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన పెంపొందించడం జరుగుతుందని వివరించి సిఏడిఈటిలలో స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్‌కె.భద్ర, ఏవో కల్నల్ నవీన్‌యాదవ్, ఏఎన్‌వో థర్డ్ ఆఫీసర్, సిహెచ్.అపురూపాదేవి పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీ నాయిబ్రాహ్మణ యూత్ కమిటీ అధ్యక్షునిగా అశోక్





**ప్రజాపక్షం/వైరా:** నాయిబ్రాహ్మణ సేవా సంఘం ఖమ్మం జిల్లా కన్వీనర్ నంద్యాల నర్సింహారావు ఆధ్వర్యంలో వైరా మున్సిపాల్ పరిధి నాయి బ్రాహ్మణ యూత్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి జిల్లా నాయకులు రావులపాటి శ్రీనివాసరావు, ఖమ్మం పట్టణ అధ్యక్షులు యలమందల జగదీష్, కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాసరావు, వైరా మున్సిపాలిటీ నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కుదురుపాక వెంకటేశ్వర్లు ఆద్వర్యంలో వైరా మండల అధ్యక్షులుగా కుదురుపాక దర్గయ్య, యూత్ కమిటీ అధ్యక్షులు యలమందల అశోక్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి వైరా పమ్మిణ నాయిబ్రాహ్మణ సంఘ సభ్యులు అందరూ పాల్గొన్నారు.